సాక్షి సంగారెడ్డి
సోమవారం । 26 । జూన్ । 2023



వర్షాకాలంలో వరదపోటు

డ్రైనేజీల నిర్మాణం సరిగా చేపట్టక పోవడంతో వరద నీరు కాలనీలు, రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 8లో



పాఠశాలలో తలుపులు ధ్వంసం

కొడిపల్లి ఉన్నత పాఠశాలో గుర్తుతెలియని వ్యక్తులు తరగతి గది రెండు డోర్లు ధ్వంసం చేశారు. తరగతి గదుల్లోని ఆరు ఫ్యాన్లు ఎత్తుకెళ్లారు. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు.

న్యూస్‌రీల్

ఐసీడీఎస్ మూసివేసే కుట్రను తిప్పికొడదాం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న సాయిలు

నారాయణఖేడ్: ఐసీడీఎస్‌లను మూసివేసేందుకు కేంద్రం చేసే కుట్రలను తిప్పికొడదామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. నారాయణఖేడ్‌లో ఆదివారం అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ళపాలనలో అనేక ప్రభుత్వరంగ సంస్థలు ధ్వంసం చేసి కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. సమగ్రశిశు, స్త్రీ సంక్షేమానికి, పోషకాహారం అందించేందుకు ఐసీడీఎస్ సంస్థను ఏర్పాటు చేయగా కేంద్రం నిధులివ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కుట్రలను తిప్పికొట్టడానికి వచ్చేనెల 10వ తేదీన దేశవ్యాప్తంగా కోరికలదినంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు నలుపు రంగు దుస్తులు ధరించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిరంజీవి, సంఘ అనుబంధ అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల సంఘం ఖేడ్ అధ్యక్షురాలు నాగేశ్వరీ, ఇతర బాధ్యులు శాంతమ్మ, అనురాధ, స్వరూప, నిర్మల, పూలమ్మ, శశికళ, బసంతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దామోదర రాజనర్సింహ

వట్‌పల్లి(అందోల్): పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని మేడికుందా గ్రామానికి చెందిన ఆయా వర్గాలకు చెందినవారు సంగారెడ్డిలోని తన నివాసంలో దామోదర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలోకి వచ్చిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పనులే నేటికీ దర్శనమిస్తున్నాయన్నారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కచూర్ రావు, సీనియర్ నాయకులు అంజప్ప, నాగన్న, యాదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వినోద్ కుమార్, బూత్ అధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షుడు పోచయ్య, శ్రీశైలం, విష్ణు, శ్రీనివాస్ రావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన తాగునీటి సరఫరా వ్యవస్థ

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చి సమస్యల పరిష్కారానికి రూ.9.85 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మూడు వాటర్ ట్యాంకులు, 10 వేల లీటర్ల సామర్థ్యంగల సంపు, పంపుహౌస్, గ్రావిటీ మెయిన్లు, పంపింగ్ మెయిన్లు, నీటి పంపిణీ వ్యవస్థ, ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్, సరఫరా, పంపుల టెస్టింగ్, బల్క్ ఫ్లో మీటర్లు, హౌస్ సర్వీసు కనెక్షన్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ సర్వీస్ ఇంప్రూవ్‌మెంట్‌ప్లాన్, సెంట్రల్ మానిటరింగ్ సిస్టం తదితర పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు రవీందర్‌నాయక్, పరశురాం, అభిషేక్ షెట్కార్, మూఢ రామకృష్ణ, అబ్దుల్ మాజిద్, బాసింత్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కేసీఆర్ రాకతో మరింత జోష్



తెల్లాపూర్ పరిధిలో నిర్మాణాలు

- కొద్దికాలంగా నిస్తేజంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం
- మెట్రో రైలు, ఐటీహబ్ ప్రస్తావనతో చిగురించిన ఆశలు
- భూ వ్యాపారం పెరుగుతుందని స్థానికంగా చర్చలు



కొల్లూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించిన సంగతి అందరికి విధితమే. అనంతరం పటాన్‌చెరు పట్టణంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మెట్రో రైలు, ఐటీహబ్ ప్రస్తావన తేవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పుడు అందరూ ఈ ప్రాంతం వైపు చూస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరుగుతుందన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాంతంలో రింగ్ రోడ్డు అభివృద్ధి చేయడంతో ఈప్రాంత భూముల విలువ రెట్టింపయ్యింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగింది. రింగ్ రోడ్డు చుట్టూ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనలు నిర్మించారు. ఈ ప్రాంతంతోపాటు, పటాన్‌చెరు చుట్టు పక్కల గ్రామాల్లో భూముల విలువ పెరగడంతో అనేక మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉన్నత అధికారులు ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. కాగా కొద్దికాలం రియల్ ఎస్టేట్ వ్యాపారం నత్తనడకన సాగుతుందన్న వార్తలు వినిపించాయి. తాజాగా ముఖ్యమంత్రి రాకతో పూర్వవైభవం రానుందని స్థానికులు భావిస్తున్నారు. ఐటీ పరిశ్రమలను ఈప్రాంతంలో అభివృద్ధి చేయడంవల్ల స్థానికులకు ఉపాధి దొరకడం తోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

జోరుగా రియల్ వ్యాపారం



ముఖ్యమంత్రి ఈ ప్రాంతానికి రావడంతో అందరిలో జోష్ పెరిగింది. ఇప్పటికే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. మెట్రో రైలు, ఐటీ హబ్‌ల ప్రకటనతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపు అందుకున్నట్లే. అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం ఈ ప్రాంతంపై దృష్టిసారించారు.

– లచ్చిరాం నాయక్, కౌన్సిలర్

ఈ ప్రాంతానికి డిమాండ్



సీఎం పర్యటనతో ఈ ప్రాంతానికి మరింత డిమాండ్ పెరిగింది. మెట్రో రైలు వస్తే అది రెట్టింపు అవుతుంది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. మౌలిక వసతుల కల్పన జరిగితే మరింత అభివృద్ధి చెందుతుంది.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బీఆర్టీయూను బలపరచండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బీ పరిశ్రమలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ ఐక్య కూటమి తరపున పోటీచేస్తున్న కార్మిక శాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో కిర్బీ పరిశ్రమ బీఆర్టీయూ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. త్వరలో జరగనున్న కిర్బీ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్, టీఎన్ టీయూసీ, బీఎంఎస్ కూటమిగా ఏర్పడి పోటీ చేయనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే బీఆర్టీయూ, ఈసారి కిర్బీ పరిశ్రమ కార్మికుల సంక్షేమం కోసం కూటమిగా పోటీ చేస్తోందన్నారు. ప్రస్తుత అధికార యూనియన్ సీఐటీయూ పరిశ్రమ యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. పరిశ్రమ లాభాల్లో కొనసాగుతున్నప్పటికీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పారిశ్రామిక రంగంలో అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలతో అంతర్జాతీయ పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. దీంతో లక్షలాది ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మధ్య అంతరాలను పెంచుతున్న కేంద్రం

- ఓట్ల కోసం మతరాజకీయాలు చేస్తున్న బీజేపీ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

జహీరాబాద్ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య అంతరాలను పెంచుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆదివారం జహీరాబాద్‌లో జరుగుతున్న ఆలిండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ తృతీయ రాష్ట్ర మహాసభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓట్ల కోసం బీజేపీ రాజకీయాలు చేస్తోందని, ముస్లింలు ఈ దేశస్తులు కారని, పరాయదేశస్తులన్న వాదాన్ని తీసుకొస్తుందన్నారు. బీజేపీకి హిందూ మతంపై ప్రేమలేదని, హిందూ రాజకీయాలు, హిందువుల ఓట్ల కోసం ప్రేమ చూపుతుందన్నారు. హిందువుల్లో ఉన్న పేదల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. భారత్ బహుళ మతాలు, సంస్కృతితో కూడిన దేశమని, అమెరికాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. నిజానికి ఈ దేశంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి మత రాజకీయాలను చేస్తుందని విమర్శించారు. ఆర్థికంగా వెనుకబడిన ముస్లింలు అభివృద్ధి చెందాలని, రిజర్వేషన్లు ఇస్తే వాటిని రద్దు చేస్తామని హోం మంత్రి అమిత్‌షా పేర్కొనడం శోచనీయమన్నారు. దేశంలోని ప్రజలందరూ బాగుండాలన్నదే తమ సిద్ధాంతమన్నారు. ప్రజలకు మతాల పట్ల విశ్వాసం ఉంటుందన్నారు. సమాజంలోని అన్ని మతాల ప్రజలు బాగుండాలని, అందరూ కలిసి ముందుకు వెళ్లాలన్నదే ఇన్సాఫ్ ప్రధాన ఉద్దేశమన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్, తంజీమ్ ఏ ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ ఫయాజ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు మునీర్ పటేల్, సీపీఐ కార్యదర్శి నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించి బదిలీలు, పదోన్నతులను వెంటనే ప్రకటించాలని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని మాధవసదన్ లో జిల్లా ప్రశిక్షణ వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 నుంచి పదోన్నతులు చేపట్టకపోవడం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా భావించాలన్నారు. ఐదేళ్లలో బదిలీలు నిర్వహించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు అందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యాశాఖలో సుమారు 18 వేలు ఖాళీలు ఉన్నప్పటికీ భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. జులై 1వ తేదీ నుంచి కొత్త పీఆర్సీ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు పీఆర్సీ కమిషన్ నియమించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప, రాష్ట్ర సహకోశాధికారి భాస్కర దేశ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్, జిల్లా బాధ్యులు, వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దేశచరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ఎమర్జెన్సీ దేశచరిత్రలో చీకటి అధ్యాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కందిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసి జైలుకెళ్లిన సంగారెడ్డికి చెందిన పన్యాల ప్రభాకర్, నల్ల రాజారత్నం, విఠల్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, కిష్టయ్య, జనార్దన్ చారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 25 ఎమర్జెన్సీ దేశచరిత్రలో చీకటి అధ్యాయమన్నారు. ప్రజాస్వామ్య పునాదులను కదిలించడానికి నాటి ప్రధాని ఇందిరా గాంధీ నియంతగా వ్యవహరించిన తీరు అత్యంత దౌర్భాగ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే.. కబ్జా అనడం సరికాదు

ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

కొండాపూర్(సంగారెడ్డి): ఇల్లు లేక పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఏర్పాటు చేసుకుంటే కబ్జా చేశారంటూ అధికారులు తరిమేస్తున్నారని ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన మహబూబాబాద్‌లో ప్రారంభమైన రాష్ట్ర బస్సు యాత్ర ఆదివారం సంగారెడ్డికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పేదలు గుడిసె వేసుకుంటే భూమిని కబ్జా చేయడం కాదని, అది వారి హక్కు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్న పేదలకు ఇళ్లు లేకపోవడం బాధాకరమైన విషయమన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యపై చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఆ రోజు ప్రకటన చేయాలని, లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోటా రమేశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల జోలికి వస్తే ఉద్యమిస్తాం

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్యం

సదాశివపేట (సంగారెడ్డి): దళితుల భూముల జోలికి ప్రభుత్వం వస్తే పోరాటం తీవ్రతరం చేస్తామని, హెచ్‌ఎండీఏ లే అవుట్ పేరుతో వారి భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం తగదని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్యం అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణ పరిధిలోని దళితుల భూములను హెచ్‌ఎండీఏ లే అవుట్ పేరుతో స్వాధీనం చేసుకునేందుకు చూస్తున్న భూములను దళితులతో కలిసి కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదాశివపేటకు చెందిన 200 దళిత కుటుంబాల భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు అధికారులు ప్రయత్నించడం దారుణమన్నారు.

నేడు మహారాష్ట్రకు సీఎం కేసీఆర్

జహీరాబాద్: సీఎం కేసీఆర్ సోమవారం మహారాష్ట్రకు వెళ్లనున్నారని బీఆర్‌ఎస్ వర్గాలు ఆదివారం తెలిపాయి. 'ఉదయం 10గంటలకు ప్రగతి భవన్ నుంచి బయలుదేరి పటాన్‌చెరు, జహీరాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్తారు. రాత్రి షోలాపూర్‌లో బస చేస్తారు. 27వ తేదీన ఉదయం పండరీపురం లోని పాండురంగ దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం తుల్జాపూర్ వెళ్తారు. అక్కడ ప్రఖ్యాత భవానీ మాత ఆలయాన్ని దర్శిస్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తెలంగాణకు తిరుగు ప్రయాణం అవుతారు'అని వ తెలిపాయి. సీఎం వెంట మంత్రులు, ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు వెళ్తారని తెలిసింది.

రైతన్నకు అండగా..



కంకోల్ రైతువేదికలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- జిల్లాలో 116 రైతు వేదికలు
- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ
- ప్రభుత్వ పథకాలు, రాయితీలు వివరిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): జిల్లాలో 26 మండలాల్లో మొత్తం 116 రైతు వేదికలు ఉన్నాయి. 26 మంది మండల (ఏఓలు) వ్యవసాయ అధికారులు, 116 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)లను రైతులకు సేవలందిస్తున్నారు. రైతు వేదికల నిర్మాణంతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఏఈఓల ద్వారా పంటల సాగుపై వారిని ఎప్పటికప్పుడు చైతన్యపరుస్తున్నారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రైతులకు వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం అందిస్తోంది. దీనికి తోడు అన్నదాతలు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. అలాగే రైతులందరినీ ఒకచోట చేర్చి వారికి పంటలసాగుపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికలను ఏర్పాటు చేసింది.

బహుళ ప్రయోజనాలు

- జిల్లాలో నిర్మించిన రైతు వేదికలతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయి. ప్రతీ క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సలహాలు ఇస్తున్నారు, సూచనలు చేస్తున్నారు.
- రైతు వేదికల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పంటలసాగుపై అవగాహన కల్పిస్తున్నారు.
- పంటలకు తెగుళ్లు సోకినప్పుడు క్లస్టర్ పరిధిలోని ఏఈఓలు పంటలను నేరుగా సందర్శించి వాటి నివారణకు సూచనలు చేస్తున్నారు.
- రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తున్నారు.
- పంటలకు తెగుళ్లు సోకినప్పుడు వాటి నివారణకు గతంలో రైతులు అవగాహన లేకుండా మందులు పిచికారీ చేసేవారు. దీంతో తెగుళ్ల తగ్గకపోగా రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. ఇప్పుడు రైతువేదికలు వచ్చిన తర్వాత పంటలకు ఏ తెగులు సోకింది, దాని నివారణకు ఏ మందులు వాడాలో అధికారులు చెబుతున్నారు.

సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం



మండలంలో ఆయా క్లస్టర్ పరిధిలోని రైతువేదికల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నాం. సమావేశంలో రైతులకు పంటల సాగుపై విత్తనాలు, ఎరువుల వినియోగం, తెగుళ్ల సమయంలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం.

– శివకుమార్, ఏఓ

అవగాహన కల్పిస్తున్నారు



రైతువేదికలో ఏఓ, ఏఈఓలు రైతులకు పంటల సాగు వివరాలు తెలియజేస్తారు. అలాగే పంటలకు తెగుళ్ల ఆశించినప్పుడు తీసుకోవల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు.

– నవీన్, కంకోల్ రైతు

అధికారుల సూచనలతో సాగు



మా గ్రామానికి వారంలో రెండు రోజులు అధికారులు వస్తారు. పంటల సాగుపై, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలపై అవగాహన కల్పిస్తున్నారు.

– ప్రభుగౌడ్, రైతు

అందుబాటులో వ్యవసాయాధికారులు



జిల్లాలో 116 క్లస్టర్ల పరిధిలో 26 మంది ఏఓలు, 116 మంది ఏఈఓలు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. రైతువేదికల ద్వారా పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిప్తున్నాం. పంటల సాగులో ఆధునిక సాగు పద్ధతులు, అవగాహన కల్పించి తద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం. రైతుబంధు, రైతుబీమా మంజూరుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్నాం.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

వెల్దుర్తి(తూప్రాన్): అచ్చంపేటలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. పెండింగ్ చలాన్లను క్లియర్ చేయించారు. అనంతరం సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల్లో మనోధైర్యం కల్పించేందుకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎంతో రక్షణగా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులుగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరవేయాలన్నారు. గ్రూపు తగాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లారం సీఐగా నయీమొద్దీన్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం బొల్లారం సీఐగా నయీమొద్దీన్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. స్టేషన్ సిబ్బందితో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితోనే నేరాలు అదుపులోకి వస్తాయన్నారు. బొల్లారంలో విధులు నిర్వహించిన సురేందర్‌రెడ్డి పదోన్నతిపై బదిలీపై వెళ్లారు.

బైక్ చోరీ

మెదక్‌జోన్: మెదక్ మండలం మంబోజిపల్లిలో బైక్ చోరీకి గురైనట్లు చేగుంటకు చెందిన బొల్లి సూర్య ప్రకాశ్ ఆదివారం మెదక్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట గ్రామానికి చెందిన బొల్లి సూర్య ప్రకాశ్‌కు మెదక్ మండలం మంబోజిపల్లిలో ప్లాట్ ఉంది. ఈ నెల 1న, సూర్యప్రకాశ్ తన ప్లాట్ వద్దకు వచ్చి దానిని శుభ్రం చేశాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బైక్‌ను అక్కడే ఉంచి భోజనానికి హోటల్‌కు వెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్‌ను ఎవరో దొంగిలించారు. ఈ విషయంపై ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీసులు, కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా భాను సప్తమి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వటప్‌పల్లి(అందోల్): జోగిపేట మున్సిపల్ పట్టణంలోని శ్రీ మాణిక్య ప్రభు మందిరంలో ఆదివారం వైభవంగా భాను సప్తమి పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి 108 ఎర్రని పుష్పాలతో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం పురం లక్ష్మణ్ గుప్తా ఆధ్వర్యంలో యోగాలో మహిళలు, యువకులు పాల్గొని సూర్య నమస్కారాలు చేశారు. పూజలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభాపతి మాణిక్య శర్మ, పట్టణ పురోహితులు రమణ శర్మ, కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్, ఖండాల్కర్ నరసింహారావు, పటాలే వేంకటేశం, కమ్మరి నాగభూషణం, గుర్రం కృష్ణ, ఎం ప్రభు శంకర్, కుమ్మరి శ్యామల, కూర మాధవి, మర్పల్లి అన్నపూర్ణ, ముధలాకర్ విజయలక్ష్మి, ప్రభు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వరదపోటు



కోహీర్ ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు (ఫైల్)

- జహంగీర్‌వాడ అందుకు నిలువుటద్దం
- రూ.70 లక్షలతో డ్రెయిన్ నిర్మాణ ప్రతిపాదన బుట్టదాఖలు?
- రోడ్లు, కాలనీలను ముంచెత్తుతున్న మురుగు
- వేధిస్తున్న నిధుల కొరత
- ఇదీ కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీ డ్రైనేజీ వ్యవస్థ దుస్థితి

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయిన్ల నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు నిధుల కొరత వల్ల అమలుకు నోచుకోవడంలేదు. సరైన డ్రెయిన్ల నిర్మాణం చేపట్టక పోవడంతో వరద నీరు కాలనీలు, రోడ్లను ముంచెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పారిశుధ్యానికి విఘాతం కలుగుతోంది.

ప్రధాన రహదారిపై మురుగు

- ఆదిలోనే హంసపాదు అన్న చందంగా హైదరాబాద్ – ముంబయి జాతీయ రహదారి నుంచి కోహీర్‌లోకి ప్రవేశించడంతోనే మురుగునీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. ఒకవైపు షాపింగ్ కాంప్లెక్స్, మరోవైపు మిషన్ భగీరథ సంప్ హౌస్ నిర్మాణంతో ఎక్కల్‌దేవి కుంట క్రాస్‌రోడ్డు సమీపంలో సుల్తాన్‌వాడీ నుంచి వచ్చే మురుగు రోడ్డుపై నిలిచి ప్రయాణానికి విఘాతం కలిగిస్తోంది. వర్షాకాలంలో రోడ్డుపై వరద నిలిచి వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఈ రోడ్డుపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ కల్వర్టు నుంచి రైల్వే గేటు వరకు సుమారు 5 వందల మీటర్ల పొడుగునా డ్రెయిన్ నిర్మించాలని చేసిన ప్రతిపాదనకు కార్యరూపం దార్చడంలేదు.



కోహీర్ ఎంపీపీ కార్యాలయం చుట్టూ చేరిన వరద నీరు (ఫైల్)

- కోహీర్‌లోని బసంత్‌పూర్ కాలనీలో డ్రెయిన్ సౌకర్యంలేక కాలనీలోని మురుగునీరు సీసీ రోడ్డుపై నిలిచి ప్రయాణానికి ఇబ్బంది కలుగుతోంది.
- జహంగీర్‌వాడలో సరైన డ్రెయిన్ వ్యవస్థలేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో వరద నీరు ఇళ్లలోకి వెళ్లి కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
- బసంత్‌పూర్ కాలనీ నుంచి జహంగీర్‌వాడ మీదుగా ఎక్కల్‌దేవి కుంట వరకు రూ.70 లక్షలతో డ్రెయిన్ నిర్మించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేసిన ప్రతిపాదన నిధుల కొరత వల్ల కార్యరూపం దాల్చడం లేదు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఒక మోస్తరు వర్షం కురిస్తే చాలు ఎంపీపీ కార్యాలయం జల దిగ్బంధనానికి గురవుతోంది. కార్యాలయం చుట్టూ విస్తరించిన కొత్త కాలనీ ప్రజలు సైతం వరద నీటితో ఇబ్బందులకు గురి కావలసి వస్తోంది.
- గొల్లబండ ప్రాంతంలో, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వెనుకవైపు ఉన్న కాలనీలో, సంజయ్ నగర్ కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పట్టణంలోని చౌకీ, మిషన్ కంపౌండ్, కసాబ్‌వాడీ, ఖస్బ, గొల్లబండ తదితర ప్రాంతాల్లో మురుగునీరు ప్రవహిస్తూ రోడ్లు ఛిద్రమై.. వాహనాల రాకపోకలకు విఘాతం కలిగిస్తున్నది. అయితే అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దడానికి నిధులను వెంటనే మంజూరు చేయాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నిధుల కొరత



సువిశాలంగా 18 వార్డులుగా విస్తరించిన కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దడానికి ప్రణాళికలను సిద్ధం చేశాం. అవసరమగు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ప్రజా ప్రతినిధులకు అర్జీలు పంపించాం. నిధులు మంజూరు కాగానే అవసరమైన నిర్మాణాలను చేపడతాం.

– లక్ష్మణాచారి, కార్యనిర్వాహణాధికారి, కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీ

27న ఆది జగద్గురు పంచాచార్య యుగ మహోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): ఈ నెల 27న సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని గోకుల్ ఫంక్షన్ హాల్లో ఆది జగద్గురు పంచాచార్య యుగ మహోత్సవం, మహాత్మా బసవేశ్వర జయంతిని నిర్వహించనున్నారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి జిల్లాలోని వీరశైవులందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎడ్ల బజారు బసవేశ్వర వీరశైవ లింగాయత్, చౌకీమట్టం వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు ముద్దనాగు, చీల మల్లన్న పిలుపునిచ్చారు. ఆదివారం సదాశివపేట పట్టణంలోని బసవసేవా సదన్ ఫంక్షన్ హాల్, ఎడ్ల బజార్ బసవేశ్వర మందిరంలో ఆది జగద్గురు పంచాచార్య యుగ మహోత్సవం, మహాత్మా బసవేశ్వర జయంతోత్సవ ఆహ్వాన పత్రికలను వీరశైవ సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుగ మహోత్సవం, మహాత్మా బసవేశ్వర జయంతిలకు శ్రీశైలం, కాశి, ఉజ్జయిని మందిరాల నుంచి జగద్గురువులు ప్రత్యేక ఆహ్వానితులుగా రానున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు అన్ని శెట్టి జయప్రకాశ్, పిల్లోడి విశ్వనాథం, గంధిగరాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం..బీరంగూడలోని శిరిడి సాయి కాలనీకి చెందిన ముసునూరు సుబ్రహ్మణ్యం (59) ప్రవేట్ పరిశ్రమలో పనిచేస్తూసూరిటైర్డ్ అయి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. దీంతో సుబ్రహ్మణ్యం భార్య వసుంధర కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు దీంతో భర్త అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జహీరాబాద్ టౌన్‌లో..

జహీరాబాద్ టౌన్: మల్‌చెల్మ గ్రామానికి చెందిన యువ కుడు అదృశ్యమయ్యాడు. రూరల్ ఎస్ఐ కాంతారావు తెలిపిన వివరాల ప్రకారం..మల్‌చెల్మకు చెందిన ఎండీ ఖాజా(35) బతుకుదెరువు కోసం వెళ్లి హైదరాబాద్‌లోని గాజులరామరంలో ఉంటున్నాడు. ఈ నెల 22న ఆయన స్వగ్రామానికి వచ్చాడని, ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదన్నారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద ఆచూకీ కోసం గాలించిన ఫలితం లేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సుబ్రహ్మణ్యం (ఫైల్)

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్..

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆర్థిక ఇబ్బందులతో ఓ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఆదివారం జరిగింది. సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ మండలానికి చెందిన మీసాల మాణిక్యం(52) అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన కేపీహెచ్‌బీ పీఎస్ నుంచి ఇటీవల మోకిల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈనెల 24వ తేదీ రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం భార్య ప్రశాంతి చర్చికి వెళ్తానంటే బైక్‌పై చర్చి వద్ద దిగబెట్టి, తను డ్యూటీకి వెళ్తానని చెప్పి తిరిగి వచ్చాడు. డ్యూటీకి వెళ్లకుండా ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసున్నాడు. చర్చి నుంచి తిరిగొచ్చిన భార్యకు భర్త ఉరివేసుకొని కనిపించడంతో బోరున విలపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మాణిక్యంకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పిల్లలు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. ఇంటిలో భార్యాభర్తలు మాత్రమే ఉంటున్నారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది.



మాణిక్యం (ఫైల్)

జీవితంపై విరక్తితో..



సంఘటనా స్థలం వద్ద విచారిస్తున్న సీఐ, ఎస్ఐలు

ఝరాసంగం(జహీరాబాద్): జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని క్రిష్టాపూర్ గ్రామానికి చెందిన ఇందూరు పాండుతో 22 సంవత్సరాల క్రితం కొంషట్‌పల్లి గ్రామానికి చెందిన మంజుల(40)తో వివాహం జరిగింది. కొన్ని రోజులుగా ఆమె మానసిక స్థితి బాగలేక తరచూ భర్తతో గొడవపడుతుండేది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం క్రిష్టాపూర్ గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనా స్థలానికి రూరల్ సీఐ వెంకటేశ్, ఎస్ఐ రాజేందర్‌రెడ్డి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి సంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో లారీ క్లీనర్ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై లారీ క్లీనర్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అంతగిరి రిజర్వాయర్ వద్ద నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. దీని కోసం తమిళనాడు నుంచి కేబుల్ వైర్‌ను లారీలో ఇక్కడికి తీసుకొస్తున్నారు. అదే రాష్ట్రానికి చెందిన అల్లా భకేష్ లారీ డ్రైవర్‌గా, క్లీనర్‌గా సద్దాం హుస్సేన్(31), హెల్పర్‌గా సతీశ్‌లు లారీలో తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో మైలారం శివారులో రోడ్డుపైన 11 కేవీ వైర్లు ఉన్నాయి. దీంతో లారీలో ఉన్న కేబుల్‌కు తాకుతుందని సద్దాం, సతీశ్‌లకు డ్రైవర్ చెప్పాడు. వారిద్దరు కిందకు దిగారు. లారీకి కుడి వైపు సతీశ్ కర్రతో వైర్లు లేపాడు. ఎడమ వైపు సద్దాం ఉన్నాడు. సతీష్ వైర్లు లేపినా అవి లేవక లారీకి వైర్లు తగిలాయి. అదే సమయంలో సద్దాం లారీ ట్రాలీని పట్టుకోవడంతో ప్రమాదవశాత్తు సద్దాంకు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ భకేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సద్దాం మృతదేహం

‘అద్దె ఇంట్లోకి మృతదేహాన్ని రానివ్వలేదు’

రామాయంపేట(మెదక్): అద్దె ఇంట్లోకి మృతదేహాన్ని తీసుకరానివ్వకుండా అడ్డుకున్న అమానవీయ సంఘటన ఆదివారం రామాయంపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని శివ్వాయపల్లికి చెందిన శ్రీనివాసచారి కొన్నేళ్లుగా ఆరో వార్డులో ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. అతడు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. తాము ఉంటున్న అద్దె ఇంటికి మృతదేహాన్ని తరలించడానికి ప్రయత్నించగా, ఇంటి యజమాని అంగీకరించలేదు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ కల్పించుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫ్రిజర్‌లో భద్రపరిచేలా చర్యలు తీసుకున్నారు. నేరుగా ఆసుపత్రినుంచే మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ఈ విషయాన్ని పలువురు ఖండించారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెదక్ రీజియన్ మేనేజర్ డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు సుదర్శన్ అన్నారు. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి12.30 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా లోని ప్రయాణికులు వారి యొక్క సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. మీ సలహాలు, సూచనలు ఇవ్వదలచిన వారు 8500376267 నెంబర్‌పై సంప్రదించాలన్నారు.

నేడు అయ్యప్ప దేవాలయంలో ఉత్తర నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని నవరత్నాలయ దేవస్థానంలో అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ఉత్తరా నక్షత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాము గురుస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, 8 గంటలకు పల్లకి సేవ నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు దేవాలయంలో అష్టాదశ మహా పడిపూజ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని స్వామిజీ కోరారు.

పశువుల అక్రమ తరలింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో తరలిస్తున్న 18ఎద్దులను రామచంద్రాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున జహీరాబాద్ నుంచి ముషీరాబాద్‌కు చెందిన వ్యక్తులు తరలిస్తున్నక్రమంలో రామచంద్రాపురం పట్టణంలోని ఇక్రిశాట్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలో వాటిని పట్టుకున్నారు. దీంతో ఆ ఎద్దులను గోశాలకు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

భార్య మృతి, భర్తకు స్వల్ప గాయాలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొట్టిన ఘటనలో భార్య మృతిచెందగా, భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతురాలి భర్త, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ గాజుల రామారానికి చెందిన రాజు వంట మాస్టర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాజు, అతడి భార్య సక్కుబాయి(38)లతో కలిసి కొండపూర్ మండలం సైదాపూర్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం సైదాపూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారు ప్రాంతానికి చేరుకోగానే అక్కడ వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం అతివేగంగా దూసుకొచ్చి స్కూటీని బలంగా ఢీ కొట్టింది. ఆ వేగానికి వెనుక కూర్చొని ఉన్న భార్య సక్కుబాయి అవతల వైపు జాతీయ రహదారిపై పడింది. ఈ హఠాత్పరిణామాన్ని గమనించక పోవడంతో అటుగా వస్తున్న పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ తప్పించలేక ఆమెపై నుంచి పోనిచ్చాడు. దీంతో సక్కుబాయికి తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యింది. భర్త రాజు కూడా గాయాలయ్యాయి అయితే వీరిని ఢీకొన్న కారుని, సక్కుబాయిపై ఎక్కిన లారీని రెండు వాహనాలు ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సక్కుబాయి (ఫైల్)

మంత్రుల పరామర్శ



కమలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర పరిశ్రమల శాఖ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తల్లి కమలమ్మ మృతి పట్ల మంత్రులు సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లోని బాలమల్లు నివాసంలో వారి కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పరామర్శించారు. రెడ్డి ఫంక్షన్ హాల్లో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గ్యాదరి కిషోర్, రసమయి బాలకిషన్, క్రాంతికిరణ్, శాసన మండలి చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు పల్లారాజేశ్వర్‌రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవి ప్రసాద్, శ్రీనివాస్‌గుప్తా, లక్ష్మణ్‌రావు, పాతూరి సుధాకర్‌రెడ్డి, బొంతురామ్మోహన్, తదితరులు కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.

పాఠశాలలో తలుపులు ధ్వంసం

ఆరు ఫ్యాన్లు చోరీ



కొడిపల్లి ఉన్నత పాఠశాలలో తలుపులు ధ్వంసం చేసిన దృశ్యం

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు తరగతి గది రెండు డోర్లు ధ్వంసం చేశారు. తరగతి గదుల్లోని ఆరు ఫ్యాన్లు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఆదివారం ఉదయం తలుపులు ధ్వంసమై ఉండడాన్ని స్థానికులు గమనించి ఎస్ఎంసీ చైర్మన్ జగన్‌తో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులకు తెలిపారు. వారు పాఠశాలకు వచ్చి చూడగా రెండు తరగతి గదుల డోర్లు, మన ఊరు మన బడి కింద కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు ఫ్యాన్లు చోరీ చేశారు. మరో రెండు ఫ్యాన్ల రెక్కలు విరగొట్టారు. వైరింగ్, స్విచ్‌బోర్డులు సైతం పాడు చేశారు. ఈ విషయంపై ఎస్ఎంసీ చైర్మన్ జగన్, ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మరో గది తలుపులు పగుల గొట్టిన దృశ్యం

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి చెందారు. పాము కాటుతో ఒకరు, బైక్‌పై నుంచి కింద పడి బాలుడు మృతి చెందారు.

నర్సాపూర్‌రూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం హైమద్ నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కట్టి లింగయ్య(42) ఈ నెల 23న ఇంట్లో నిద్రిస్తుండగా కట్ల పాము కాటేసింది. దీన్ని గమనించిన కుటుంబీకులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుని భార్య పోచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆనంద్ (ఫైల్)

శివ్వంపేటలో బాలుడు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న గొట్టిముక్ల గ్రామానికి చెందిన బోధనం ఆనంద్(14) ఈ నెల 16న బైక్‌పై పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా రోడ్డుపై ఒక్కసారిగా కోతులు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆనంద్ తలకు, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడు తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కట్టి లింగయ్య (ఫైల్)

గ్రామాల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు, జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ కృషితో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఖాజిపల్లి గ్రామంలో జీవీఆర్ ఎంటర్ ప్రైజెస్ కృషితో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అభివృద్ధిలో ప్రతీ ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నామన్నారు.

జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ కృషితో పాటు పలు పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేపడుతున్నామన్నారు. పటాన్‌చెరులో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రూ.15 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నరసింహా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో గల చెరువుల వద్ద గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బీఆర్ఎస్ నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ హాజరై, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ చొరవతో ప్రతి చెరువు నిండు కుండలా ఉందని, గంగమ్మ గలగలతో పంటలు బాగా పండుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహసభ అధ్యక్షుడు పులిమామిడి రాజు, గ్రామ మత్స్యశాఖ అధ్యక్షుడు మహేశ్, సాయి, శంకరయ్య, శ్రీశైలం, బాలేష్, తదితరులు పాల్గొన్నారు.



ఊట్ల గంగమ్మ జాతరలో డోలు వాయిస్తున్న నీలం మధు